## గురుపౌర్ణమి వేళ సాయినాథుని సన్నిధిలో భక్తుల వెల్లువ

**మార్కండరాజాపేట సాయిబాబా ఆలయంలో విశేష పూజలు.. సుందర అలంకరణతో ప్రత్యేక దర్శనం**



**తుని, జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** కాకినాడ జిల్లా తుని పట్టణంలోని మార్కండరాజాపేట సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం సాయిబాబాను సుందరంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.గురుపౌర్ణమి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేసి దర్శన కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల రద్దీతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## పుట్టినరోజు సందర్భంగా రోగుల సహాయకులకు అన్నప్రసాదం

**శ్రీ సరస్వతి విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ**



**తుని, జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల సహాయకులకు శ్రీ సరస్వతి విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, శ్రీదేవి దంపతులు తమ కుమారుడు కుచ్చర్లపాటి శ్రీకాంత్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణతో పాటు జి. రాము, ప్రశాంతి, కుచ్చర్లపాటి సత్యవతి పాల్గొన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి అన్నప్రసాదం అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు.

## శాకాంబరి అలంకరణలో వరమహాలక్ష్మి దివ్య దర్శనం

**చిట్టూరి మెట్టలో ఆషాఢ పౌర్ణమి వేడుకలు ఘనం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు**



**తుని, జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తునిలోని చిట్టూరి మెట్టలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా వరమహాలక్ష్మి అమ్మవారిని శాకాంబరి అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలతో తీర్చిదిద్దిన అమ్మవారి ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, భజన కార్యక్రమాలు, లలిత సహస్రనామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, దశవిధ హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణంలో మార్మోగింది.శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చిన వరమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమ కుటుంబాలకు అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

## ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల స్పందన

**పాయకరావుపేటలో కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన నాయకులు**



**పాయకరావుపేట, జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట పట్టణంలోని స్థానిక పాండురంగస్వామి ఆలయం వెనుక ఉన్న 67వ బూత్ పరిధిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు యాల్ల వరహాలుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అలాగే రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ పథకాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనిట్ కన్వీనర్ పెదిరెడ్డి శ్రీను, సీనియర్ నాయకుడు గూటూరు శ్రీను, జూరెడ్డి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, యూనిట్ ఇన్‌చార్జిలు వేములపూడి అప్పారావు, రాజన ఆది, బూత్ ఇన్‌చార్జిలు పల్లా శ్రీను, మంజులూరి దుర్గాప్రసాద్, యర్ర నరేష్, గొడపర్తి భాస్కర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## గురువుల సేవలకు ఘన వందనం.. ఎంఈవో రమేష్‌బాబుకు సన్మానం

**గురుపౌర్ణమి వేడుకల్లో కెహెచ్‌వాడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఘన సత్కారం**



**పాయకరావుపేట, జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** గురుపౌర్ణమి సందర్భంగా పాయకరావుపేట కెహెచ్‌వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి రమేష్‌బాబును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి గౌరవ మర్యాదలతో సత్కరించారు.ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ తన గురువు కె.ఆర్.జి.ఎస్. శర్మ అందించిన మార్గదర్శకత్వం, ఆశీస్సుల వల్లే తాను గెజిటెడ్ మండల విద్యాశాఖ అధికారిగా ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. "గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరః.. గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై గురవే నమః" అనే శ్లోకాన్ని ఉటంకిస్తూ గురువు స్థానం అత్యున్నతమని పేర్కొన్నారు.జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పట్ల భక్తి, గౌరవం, క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.ఎల్.ఎన్.వి. ప్రసాద్, పి.డి. లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పి. శ్రీనివాస్, నరసింహరాజు, రమణరాజు, రఘు, మారుతిబాయి, పద్మావతి, శ్రీదేవి, విజయలక్ష్మి, వల్లి, సూర్యభగవాన్, చంద్రయ్య, సుష్మ, ఆశాభాను, శారీరక విద్యా ఉపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం,రామకృష్ణాపురం, లో సాయి భక్తులకు అన్నదాన కార్యక్రమం.



**ప్రజా న్యూస్ . విశాఖపట్నం, జూలై. 29 :** గురు పౌర్ణమి పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం 61 వ వార్డు రామకృష్ణాపురం, గోవింద సాయి పీఠంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా శిరిడి సాయిబాబా కు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, విభూది పూజలతో నిర్వహించి. అనంతరం 1,000 మంది సాయి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సీనియర్ నాయకులు, ప్రముఖ సంఘ సేవకులు, శ్రామిక శక్తి లేబర్ యూనియన్ వ్యవస్థాపకులు, విశాఖపట్నం జిల్లా కాపు తెలగా బలిజ, సంఘ అధ్యక్షులు పెద్దిరెడ్ల నానాజీ, మానాపరం శ్రీను, కృష్ణ సాయి, గురుమూర్తి వాకాడ అప్పారావు, పి రమణ, నాయుడు అనేక సంఖ్యలో సాయి భక్తులు పాల్గొన్నారు.

# తెలుగు దేశం చేపట్టిన రెండేళ్ల నమ్మకం పెద్ద బోగస్ కాకాణి



**నెల్లూరు జూలై 29 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం,మాచర్ల వారి పాళెం, చింతోపు గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు మాజీ మంత్రి కాకాణి కి ఘన స్వాగతం పలికిన మాచర్ల వారి పాలెం గ్రామస్తులు గురువులందరికీ వందనాలు సమర్పిస్తూ ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసిన కాకాణి గురు పౌర్ణమి సందర్భంగా మాచర్ల వారి పాలెం లోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మాజీ మంత్రి కాకాణి చింతోపు గ్రామ మాజీ సర్పంచ్ లేబూరు మల్లికార్జునకు ఇటీవల మాతృ వియోగం కలగడంతో కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి – తెలుగుదేశం చేపట్టిన రెండేళ్ల నమ్మకం..అభివృద్ధి, సంక్షేమం,కార్యక్రమం పెద్ద బోగస్ అని పేర్కొన్న కాకాణి.ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు మీడియాతో మాట్లాడుతూ తోటపల్లి గూడూరు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో కనీస అభివృద్ధిగానీ, ఎన్నికల ముందు ఇచ్చిన సంక్షేమ హామీల అమలు గానీ జరగలేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు గ్రామాల్లో స్తంభించిన అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలుగా మాసాలుగా గ్రామాల్లో ఏ ఒక్క కొత్త అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కాకాణి తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప కొత్తగా ఒక్క పని కూడా పూర్తి కాలేదన్నారు.అమలుకాని సూపర్ సిక్స్ హామీలు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలకు అసలు విలువే లేకుండా పోయిందని విమర్శించారు.ఆడబిడ్డల నిధి ప్రతి కుటుంబంలో ఆడబిడ్డలకు నెలకు 1,500 ఏడాదికి 18,000 ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.నిరుద్యోగ భృతి నెలకు 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ గురించి మాట్లాడటమే మానేశారని మండిపడ్డారు.?ఉచిత గ్యాస్ సిలిండర్లు: ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, తరువాత నగదు బదిలీ చేస్తామని చెప్పి మాట దాటవేస్తున్నారన్నారు ఉచిత బస్సు ప్రయాణం తల్లికి వందనం ఉచిత బస్సు పథకాన్ని అరాకొరాగా అమల్లోకి తెచ్చారని, 'తల్లికి వందనం' విషయంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు నిధుల కోత విధించి దాదాపు 20 లక్షల మందికి అన్యాయం చేశారన్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగినా కోత పడిన నిధులు ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేదన్నారు.అన్నదాత సుఖీభవ రైతులకు గతంలో ఉన్న రైతు భరోసా, అన్నదాత సుఖీభవ పథకాల సాయం కూడా సక్రమంగా అందడం లేదన్నారు పాత పింఛన్ల పంపిణీ తప్ప కొత్తవి ఏవీ కూటమి ఎమ్మెల్యేలకు గ్రామాల్లో పర్యటించడానికి కూడా ఏ పని లేదని కాకాణి వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో మంజూరైన పాత పింఛన్లను ప్రతి నెల పంపిణీ చేయడం తప్ప, ఈ 26 నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు.పాపం భర్తలు చనిపోయినటువంటి వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు అల్లాడుతున్నా సరే ఈరోజు పెన్షన్ ఇచ్చేటువంటి పరిస్థితి లేదు,ఈరోజు చంద్రబాబు నాయుడు మరల పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి... గ్రామాల్లో తిరిగే పరిస్థితి కూడా ఎమ్మెల్యేలకు లేదు కాబట్టి, ముందే మీరు గ్రామాలలోకి వెళ్లి చీవాట్లు తినేసి రండి గ్రామాల్లో, ప్రజలకు కొంచెం ఆవేశం తగ్గుతుంది అని చెప్పి, ఇప్పుడు గ్రామాలలో తిరగడానికి ఏదో కొత్త పేరు పెట్టేశారు సినిమా టైటిల్ లాగా. 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి,సంక్షేమం అని చెప్పి పంపారు రెండేళ్లలో చంద్రబాబు నాయుడి మీద నమ్మకం లేదు, పూర్తిగా కోల్పోయాడు, అభివృద్ధి జాడే లేదు. సంక్షేమం ఊసే లేదు కాబట్టి 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి,సంక్షేమం అనేటువంటిది కూడా ఒట్టి బోగస్ అనేటువంటిది ప్రజలకు అర్థమైపోయింది. అందుకే పాపం ఎక్కడికైనా వెళ్లినా కూడా బతిమాలి బామాలి అధికారులందరూ వెళ్లి 'రండి' అన్నా కూడా గ్రామస్తులు వచ్చి కూర్చునేటువంటి పరిస్థితి లేదన్నారు,చంద్రబాబు నాయుడు మరలా కూడా ఈరోజు దివ్యాంగులకు సంబంధించి స్లాట్లు అందుబాటులోకి తెచ్చి,రకరకాలైనటువంటివి చెప్పి ఎన్నికల లోపల ఏదో ఒక రకంగా పెన్షన్లు ఇచ్చి కొంచెం మాయ చేసి, ఓట్లు వేయించుకుని ఆ తర్వాత మళ్లీ ఎగ్గొట్టొచ్చు అనేటువంటి ఆలోచనలో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది చంద్రబాబు నాయుడు ఇటీవల గూడూరు సభలో నిస్సిగ్గుగా ఒక మాట మాట్లాడిపోయాడు ఇళ్లు లేవు, ఇళ్ల స్థలాలు లేవు ప్రభుత్వం వచ్చిన తర్వాత. ఇళ్ల స్థలాలు ఇచ్చింది జగన్ మోహన్ రెడ్డి గారు, ఇళ్లు కట్టించింది జగన్ మోహన్ రెడ్డి గారు. చంద్రబాబు నాయుడు ఇళ్ల స్థలం ఇవ్వకుండా, ఒక్క ఇల్లు కట్టించకుండా కట్టించినటువంటి ఇళ్లు బిల్లు క్లియర్ చేయకుండా, 97% మంది ఇళ్ల నిర్మాణంలో సంతోషంగా ఉన్నారని చెప్పి గూడూరులో ప్రకటించారు అంటే ఇళ్లు కట్టకుండానే ఇళ్లకు బిల్లు ఇవ్వకుండానే ఇళ్లలో చేరకుండానే అరాకొరాగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే, అయ్యా మేమందరం చాలా సంతోషంగా ఉన్నాం ఇళ్ల నిర్మాణం విషయంలో అని మరి ఏ విధంగా చంద్రబాబు చెవిలో చెప్పారో మాకు అర్థం కావడం లేదు కాబట్టి ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారు, ప్రజలందరినీ మోసం చేశారు. అన్ని గ్రామాల్లో తిరిగేటప్పుడు 'అయ్యా పూర్తిగా అర్థమైపోయింది, చంద్రబాబు నాయుడిది మోసం' అని ప్రజలు మాట్లాడుకునేటువంటి పరిస్థితి ఏర్పడింది. జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో చెప్పినవి ఇచ్చాడు కాబట్టి ఆ నమ్మకం, విశ్వాసం ప్రజల్లో ఉంది కాబట్టి ఈరోజు జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వాన్ని తిరిగి ప్రజలు కోరుకుంటున్నారు. ఈ రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా సరే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరలా అధికారంలోకి రావడం ఖాయం. ?అందుకే కూటమి ప్రభుత్వం చేస్తున్నటువంటి ఆగడాల మీద, ణూజ లో నిరుద్యోగులకు జరిగినటువంటి అన్యాయం మీద నిన్న యువత, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరులో భారీగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. విశేషంగా విద్యార్థులు, ప్రజలు దానిలో పాల్గొని జయప్రదం చేయడం జరిగింది నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి.లోకేష్ నైతిక విలువలు లేకుండా ప్రవర్తిస్తున్నాడు కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై కాకాణి ఆగ్రహం నైతిక విలువలు ఏమాత్రం లేని నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. లోకేష్ నైతిక బాధ్యత వహించకుండా రకరకాల మాటలతో కాలయాపన చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు మెగా డిఎస్సీ కాదు దగా డిఎస్సీ కూటమి ప్రభుత్వం 'మెగా డిఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసి, దాన్ని 'దగా డిఎస్సీ'గా మార్చేసిందని కాకాణి మండిపడ్డారు. కష్టపడి పరీక్ష రాసి, ఈ రోజు అవకాశాలు కోల్పోయిన నిరుద్యోగులకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు కేంద్ర మంత్రి రాజీనామాను చూసైనా లోకేష్ నేర్చుకోవాలి కూటమి ప్రభుత్వం లో నీట్ పేపర్ లీకేజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని కాకాణి గుర్తుచేశారు. కేంద్రంలో ఉన్న ఒక సీనియర్ మంత్రే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసినప్పుడు రాష్ట్రస్థాయిలో జరిగిన పొరపాట్లకు బాధ్యత వహించాలనే కనీస ఇంగిత జ్ఞానం కూడా లోకేష్‌కు లేకపోవడం దారుణమన్నారు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం కూటమి ప్రభుత్వ తీరును, అనుసరిస్తున్న పరిణామాలన్నింటినీ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని కాకాణి తెలిపారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుకు కూటమి పెద్దలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. అధికారం ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై పోరాడుతామన్నారు

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఆర్థిక సాయం

**షయం తెలిసిన వెంటనే స్పందించి కుటుంబానికి భరోసా**



**త్రిపురారం మండలం , జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్:** త్రిపురారం మండలం అన్నారం గ్రామానికి చెందిన జిల్లా రాములు గత వారం ఆరోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం గ్రామ సర్పంచ్ ద్వారా తెలుసుకున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి వెంటనే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. కుటుంబ పెద్దను కోల్పోయి విషాదంలో ఉన్న బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి స్పందన పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నాయుడుపాలెం సర్పంచ్ మదన్ రెడ్డి, అన్నారం సర్పంచ్ సహాయకుడు కట్టా రాకేష్ రెడ్డి, ముక్కామల సర్పంచ్ వెంకటయ్య, అన్నారం ఉపసర్పంచ్ లింగమ్మ, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 120 అన్నం ప్లేట్ల పంపిణీ

**చిన్నారుల అవసరాలకు సహకరించడం ఆనందంగా ఉంది: మాదాసు గోపి**





సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 29 ప్రజా న్యూస్ నెట్వర్క్: హుజూర్‌నగర్ పట్టణంలోని 14, 15వ వార్డుల పరిధిలో గల అంబేద్కర్ నగర్ ఉన్నత ప్రాథమిక పాఠశాల నెం.1లో విద్యార్థులకు 120 అన్నం ప్లేట్ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకళ, రాహుల్, సరిత, మాదాసు గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన ప్లేట్లను అందజేసిన అనంతరం మాదాసు గోపి మాట్లాడుతూ చిన్నారుల అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, విద్యార్థులు ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉంటూ బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత--బాబురావు, 15వ వార్డు కౌన్సిలర్ నల్లగొండ సుజాత--చంటి నిర్వాహకులను అభినందిస్తూ విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, మాదాసు గోపి బృంద సభ్యులు పాల్గొన్నారు.




## తెలంగాణ జలసిరిపై రూప్లాతండాలో గ్రామసభ

**జల వనరుల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలి: సర్పంచ్ రఘు నాయక్**



**త్రిపురారం మండలం, జూలై 29 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూప్లాతండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు సర్పంచ్ ధనావత్ రఘు నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామంలోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు వంటి జల వనరులను పరిరక్షించి అభివృద్ధి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా సక్రమంగా నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని, నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో గ్రామ ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కుటుంబం సహకరించాలని, గ్రామంలో చేపట్టే నీటి సంరక్షణ పనులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఉపసర్పంచ్ ధనావత్ మంగ్త నాయక్, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**పాత బోధనా పద్ధతులకు స్వస్తి.. ఆధునిక విధానాలతో విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 29 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించి పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనా విధానాలు, బాధ్యతలు, విద్యార్థుల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి పనితీరు ప్రమాణాల సూచీలో సూర్యాపేట జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాత బోధనా పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక విధానాలతో పాఠాలు బోధించాలని సూచించారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా కార్యాచరణ ఆధారిత బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, సమూహ చర్చల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరస్పర క్రియాత్మక డిజిటల్ బోధనా తెరలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేలా ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలతో పర్యవేక్షించాలని సూచించారు. ఒక తోటలో కొన్ని మొక్కలు మాత్రమే పూలు పూస్తే ఆ తోటకు పూర్తి అందం ఉండదని, అన్ని మొక్కలు వికసించినప్పుడే ఆ తోట అందంగా కనిపిస్తుందని ఉదాహరణగా పేర్కొంటూ, అదే విధంగా తరగతి గదిలో కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా ప్రతి విద్యార్థి తన సామర్థ్యానికి తగిన విధంగా రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ వివరించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలను గుర్తించి, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత ఉన్నత స్థానంలో నిలిపేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. అశోక్, విభాగీయ అధికారులు హరికృష్ణ, రేణుక, శిక్షణ కేంద్ర బాధ్యురాలు నాగరాణి, జిల్లా వనరుల నిపుణులు శ్రీహరి, శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

